మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ

అ ర ర ర ర ర ర ర ర ర ర ర

అరే జారె హట్ నట్ ఖట్

నా ఛూరే మెరా ఘూంఘట్

పలట్ కె దూంగీ ఆజ్ తుఝే గాలీ రే

ముఝే సంఝో నా తుం భోలీభలీ రే...

'శాంతారాం' నిర్మించిన 'నవరంగ్' సినిమాలో ప్రతి పాటా అద్భుతమే. ఈనాటికి కూడా ఆ సినిమాలోని పాటల గురించి చర్చలు సాగుతున్నాయి. పాటల చిత్రీకరణ గురించి చర్చలు సాగుతూనే ఉన్నాయి. 'అధా హై చంద్రమా రాత్ ఆధీ ', 'తూ ఛుపీ హై కహా, మై తరస్తాయహాన్ ' ఆ కాలంలో సూపర్ హిట్‌లకే సూపర్ హిట్‌గా నిలిచిన పాటలు. ఈనాటికీ ఆ తరాన్నే కాదు నవతరాన్నీ అలరిస్తున్నాయి. ఒక కళాకారుడి సున్నితమైన సృజనాత్మక మనస్సుకు అందమైన ఆవిష్కరణ 'నవరంగ్' సినిమా.

'నవరంగ్' సినిమాలో హీరో కళాకారుడు, కవి. అతడు తన భార్యను ప్రేయసి 'మోహిని'గా భావించుకుంటాడు. మోహినిని ఊహిస్తూ ప్రేమ గీతాలు రాస్తూంటాడు, 'నవరంగ్' కలం పేరుతో. అతనికి కవిత, సరస్వతి అర్చనతో సమానం.

అతని స్నేహితుడికి, హోలీ సందర్భంగా ఒక పాటను రాజ దర్బారులో వినిపించమని ఆహ్వానం వస్తుంది. కానీ కవిత రాసేందుకు హీరో నిరాకరిస్తాడు. తన కవితను డబ్బుకి అమ్మనంటాడు. అప్పుడు 'ధంధే కీ కుఛ్ బాత్ కరో కుఛ్ పైసా జోడో' అన్న హాస్యస్ఫోరక చేదు నిజాలను చెప్పే వ్యంగ్య కవితను వినిపిస్తాడు మిత్రుడు. అప్పుడు డబ్బులు

స్నేహితుడు స్వీకరించేట్టు ఒప్పందం చేసుకుంటాడు. కానీ ఈ కవితల గోలలో పడి అసలు పని మరచిపోతాడు. ఆక్కడ దీవాను, మన హీరోని తిట్టి, అలహాబాదు పొమ్మంటాడు.

ఇంటికి వెళ్లి భార్యకు చెపితే ఆమె నోరు విప్పదు. హీరోకు చిరాకు వస్తుంది. కోపం వస్తుంది. ఒక పక్క హోలీ కవిత రాయాలి, మరో పక్క ఉద్యోగ ధర్మం. ఒక కళాకారుడికి కళాసృజనకు ఎన్ని అడ్డంకులో అనిపిస్తుంది. అతడికి తన భార్య, 'నీ కోసం ఎదురు చూస్తూంటా' అని చెప్పని బాధలో ఉంటాడు. అతని భార్య చెప్పనిది, భార్య ఆధారంగా ఊహించిన ఊహా ప్రేయసి మోహిని చెప్తున్నట్టు ఊహిస్తాడు. ఇంతలో అతని మిత్రులు ఇంటికి వచ్చి కవిత రాయమంటారు. ఇంటికి రాగానే అతడిని తండ్రి దూషిస్తాడు. కవితలు రాయవద్దంటాడు. కాగితాలు విసిరేస్తాడు. ఆ కోపంలో వచ్చి వినాయకుడి విగ్రహం దగ్గర కూర్చుంటాడు విషాదంగా.

మిత్రులు అక్కడికి వచ్చి కవిత గురించి అడుగుతారు. 'ఇంట్లో శాంతి లేదు. కవిత ఎలా రాయాలంటాడు '

కదిలితే పది పదాల కవితలు రాసేసే ఫాస్ట్‌ఫుడ్ కవితల కాలంలో ఒక కవితా సృజన కోసం కవి పడే తపన, వేదన, చేయాల్సిన తపస్సు వంటి విషయాలు అర్థం కావు. కవికి మూడ్ తెప్పించేందుకు అతని మిత్రులు లయనిస్తూంటారు.

స్వతహాగా ఎంత ప్రతిభ ఉన్నా కవికి ప్రేరణ అవసరం. ప్రేరణ ఇచ్చే ఆవేశం కవి ఎలాంటి మూడ్‌లో ఉన్నా అతని సృజనకు తోడ్పడుతుంది. కవి తన కవిత సృజనలో ఆనందం పొందుతాడు. సంతృప్తి పొందుతాడు. ప్రపంచాన్ని మరచి, విస్మరించి తనదైన ప్రత్యేక సృజనాత్మక ప్రపంచంలో స్వేచ్ఛగా, విశృంఖలంగా విహరిస్తాడు. ఆ సమయంలో అతడు మామూలు మనిషికాదు. కవి. సృజనాత్మక బ్రహ్మ.

ప్రపంచం అదృశ్యమైపోతుంది బాధలు, ఆవేదనలు ఆవిరైపోతాయి. ఆ ప్రపంచంలో అతడు బ్రహ్మ. అతడి నుంచి స్వచ్ఛందంగా సృజనాత్మక ప్రవాహంలా కవిత వెలువడుతుంది. అడ్డూ అదుపు లేకుండా వడివడిగా, వేగంగా భావాలు పదాల రూపంలో పరుగులిడుతూ వెలువడతాయి.

వారి లయ విన్న కవి మనసులోంచి బాధలు అదృశ్యమయ్యాయి. అతని హృదయం లయమయమయింది. కవితాలయమయింది. మోహిని నిండింది. ప్రవాహంలా కవిత వెలువడింది. సరస్వతి అంటే ప్రవాహం.

అటక్-అటక్ ఝుటపట్ పన్ ఘట్ పర్

చటక్ మటక్ ఇక్ నార్ నవేలీ

గోరీ గోరీ గ్వాలన్ కీ చోరి చలీ

చొరీ చొరీ ముఖ్ మొరీ మొరీ ముస్కాయె అల్బేలీ

కంకరీ గలెమె మారీ కంకరీ కన్హయ్యానే

పకరీ బాహ   ఔర్ కీ అటఖెలీ

భరీ పిచ్కారీ మారీ

స ర ర ర ర ర ర ర ర ర

భోలీ పనిహారీ బోలి..

శుధమైన, స్వచ్ఛమైన హిందీ పదాలు. భరత్ వ్యాస్ ప్రత్యేకత ఇది. గేయ రచయిత భరత్ వ్యాస్ పాటలు సరళంగా, శుభ్రమైన హిందీ పదాలతో అతి స్వచ్ఛంగా ఉంటాయి. హిందీ భాష సౌందర్యం అనుభవించాలంటే భరత్ వ్యాస్ పాటలు వినాలి.

కవి హృదయంలో మోహిని మెదిలింది. హోలీ పండగ, గోపికలు, కృష్ణుడి సరస శృంగార కేళీ విలాసాలకు పెట్టింది పేరు. శ్రీకృష్ణుడు గోపికలను ఏడిపిస్తూంటాడు. పైకి అయిష్టం ప్రదర్శించినా గోపికల మనస్సుల్లో కృష్ణుడంటే ఇష్టమే. అతను ఏడ్పించటమూ ఇష్టమే. వారి తిరస్కారంలో ఆహ్వానం ఉంటుంది. పెదవి విరుపులో రమ్మన్న పిలుపు ఉంటుంది. ఈ చమత్కార భరిత శృంగార కేళీ విలాసాన్ని, ఒకరిపై ఒకరు విసురుకునే చమత్కార శృంగార భావాలనూ తన కవితలో ప్రదర్శించేందుకు కవి హృదయం సిద్ధమయింది.

భరత్ వ్యాస్ వాడిన ఒకో పదానికి సరైన అర్థం ఇతర భాషలలో లభించదు. పదాలన్నీ కలిపి భావం గ్రహించాల్సి ఉంటుంది. ఈ పదాలను ఇదే విధంగా తర్జుమా చేయటం కష్టం. లయను కాపాడటం కష్టం. ఆ అందం పోతుంది.

అటక్ – అంటే సంకోచించటం, అటక్ అటక్ అంటే ఆగి ఆగి సంకోచిస్తూ ఝట్ పట్ – అంటే వెంటనే, పన్ ఘట్ – అంటే నదీ తీరం. చమక్ – అంటే మెరుపులా చురుకుగా. లచక్ – అంటే నక్రాలు చేస్తూ, వయ్యారంగా వూపుతూ నడవటం.

ఇలా పదానికి ఆ పదం విడదీసి చూస్తే అర్ధం బోధపడదు. ఎందుకంటే, హిందీ కవితా రచన పద్ధతిలో వాక్యం తిన్నగా చెప్పటం ఉండదు. వెనకా ముందు చెప్తూంటారు. అన్నిటినీ కలిపి అర్ధం చేసుకోవాల్సి ఉంటుంది. ఛోరీ – అంటే అమ్మాయి చోరీ అంటే – దొంగతనం. గ్వాలన్ అంటే గోపిక. ఒక గోపిక నీరు తెచ్చేందుకు నది ఒడ్డుకు వెళ్లటాన్ని వర్ణిస్తున్నాడు కవి.

'శకీల్ బదాయుని ఒక్క ముక్కలో 'మోహె పన్ ఘట్ పే నంద్‌లాల ఛేడ్ గయోరే ' అన్నాడు, 'మొఘల్ – ఎ-ఆజమ్ 'లో. ఆమె నీళ్ళు తెచ్చేందుకు వెళితే, శ్రీకృష్ణుడు నది ఒడ్డున ఏడిపించాడని అంటోంది.

ఇక్కడ ఆమె నీళ్లు తెచ్చేందుకు వెళ్లటాన్ని అతి చక్కని లయ బద్ధమైన పదాలతో వర్ణించాడు భరత్ వ్యాస్.

ఒక మెరుపులాంటి గోపిక, సంకోచిస్తూ, మెల్లమెల్లగా మందగజగమనంతో నది ఒడ్డుకు వెళ్తోంది .ఆమె ఆగి ఆగి నడుస్తూ నవ్వుతూ వెళ్తోంది. కృష్ణుడిని చూసి ఏమీ పట్టనట్టు, లెక్క చేయనట్టు ముసిముసి నవ్వులు నవ్వుతూ ముఖం తిప్పుకుంది. అప్పుడు కృష్ణుడు ఆమె పైకి రాళ్లు విసిరాడు. అవి ఆమె మెడకు తగిలాయి. ఆమె బాహువులు పట్టుకుని లాగాడు. ఆమె ఊహించలేదు. ఇంతలో అతను ఆమెను రంగులలో ముంచెత్తాడు. అప్పుడు ఆ అమాయకమైన గోపిక ఇలా అంది.

కవిత వచ్చేసింది.

సాధారణంగా కవికి కవిత ఆరంభించటమే కష్టం. ఒక్కసారి ఆరంభమయిందా, జలపాత ధారను అడ్డుకోలేనట్టే, కవితా రసప్రవాహ ధారను కూడా ఎవరూ ఆపలేరు.

కృష్ణుడు ఆమె చెయ్యి పట్టుకుని లాగి అనూహ్యంగా రంగుల్లో ముంచెత్తటం వరకూ ఒక లయ, ఒక బాణీలో సాగుతుంది పాట.

సంగీత దర్శకుడు సి. రామచంద్ర భరత్ వ్యాస్ పదాలను బేరీజు వేసి, తూకం వేసి పదాల ఆధారంగా బాణీ మార్చినట్టు అనిపిస్తుంది. పదాలలో ఎక్కడ విరుపును ఇవ్వాలి, ఎక్కడ లాగాలి, ఎక్కడ ఆగి, పలకాలి.. ఇలా అద్భుతమైన రీతిలో పహాడీ రాగానికి జానపద బాణీని, లయను జోడించి పూర్తిగా దేశీ గీతాన్ని రూపొందించాడు సి. రామచంద్ర. ఇంతవరకూ పాటను సి. రామచంద్ర స్వయంగా పాడేడు.

'అరె జారె హట్ నట్ ఖట్' అంటూ ఆశాభోంస్లే ఆరంభిస్తుంది పాటను. శ్రీకృష్ణుడు వెంటబడి ఏడిపిస్తుంటే, ఆ గోపిక 'అరే పోరా, అడ్డు తొలగు అల్లరి పిల్లోడా, నా కొంగు తాకకు. నేను వెనక్కి తిరిగి నిన్ను తిడతాను. నన్ను ఏమీ తెలియని అమాయకురాలు అనుకోకు' అంటుందామె.

పాట రచనలో చమత్కారం ఏమిటంటే, తిరస్కృతిలోనే ఆహ్వానం ఉంది. కోప ప్రదర్శనలో ప్రేమ భావన దాగుంది. పొమ్మనటంలోనే రమ్మనటం ఉంది. 'హట్', 'నట్ఖట్' అంది. 'నట్ఖట్' అంటే అల్లరి పిల్లవాడు. 'నట్ఖట్' పదం తిట్టుకన్నా ప్రేమ పదం.

'బడ నట్ ఖట్ హై రే కృష్ణ కన్హయ్యా.. కా కరె యశోదమయ్యా' అంటూంది నాయిక, 'అమర్ ప్రేమ్' సినిమాలో. తల్లి అల్లరి పిల్లవాడిని ప్రేమగా 'నట్ఖట్ ' అంటోంది. గోపికలు కృష్ణుడిని 'నట్ఖట్' అంటారు. అది ప్రేమగా, పైకి కోపంగా అంటున్నట్టున్నా ప్రేమతో అనే మాట. నిజంగా అల్లరి చేసే దుష్టులను ఎవ్వరూ 'నట్ఖట్' అనరు. 'బద్మాష్' అంటారు.

పాట చిత్రీకరణలో కూడా శాంతారాం చమత్కారం చేశాడు. ఈ పాటను కవి మోహినిని ఊహిస్తూ రాశాడు. గోపిక మోహిని. కానీ కవి కల్పనలో కృష్ణుడు కూడా మోహనీయే. అందుకే నటి సంధ్య, గోపిక పాడినప్పుడు గోపిక వేషంలో కనిపిస్తుంది. కృష్ణుడు పాడేప్పుడూ పురుష రూపంలో కనిపిస్తుంది. అయితే ఆరంభంలో 'గ్వాలన్' 'కన్హయ్య' అన్నప్పుడే కృష్ణుడి ప్రసక్తి వస్తుంది. పాటలో కృష్ణుడు, గోపికల ప్రసక్తి రాదు. స్త్రీ పురుషులు ఒకరికొకరు ఏడిపించుకుంటూ చమత్కార బాణాలు విసురుకోవటమే ఉంటుంది.

భారతీయ పండుగలలో ఈ 'ఆరోపణ ' (Transference) కనిపిస్తుంది. ఆనాడు కృష్ణుడు, గోపికలతో హోలీ ఆడేడు. ఈనాడు యువతీయువకులు హోలీ ఆడతారు, కృష్ణుడూ, గోపికల్లా. ఆనాడు రావణుడిని రాముడు సంహరించాడు. ఈనాడు రావణ దహనం చేసి ఆనందిస్తాము. ఇదే పాటలోనూ చూపించాడు కవి. ఆరంభంలో కృష్ణుడు, గోపికల శృంగారం చూపించి, పాటలో యువతీ యువకుల శృంగారం, సరసాలు చూపుతున్నాడు.

ఆయీ హోలీక త్యౌహార్

ఉడే రంగ్‌కి బౌఛార్

తూ హై నార్ నఖరే దార్ మత్ వాలీ రే

ఆజ్ మీఠీ లగే హై తేరీ గాలీరే.

ఆమె 'వెనక్కి తిరిగి తిడతాను. నన్ను అమాయకురాలనుకోకు' అంది. దానికి సమాధానంగా అతడు .'హోలీ పండుగ వచ్చింది. రంగుల జల్లు కురుస్తోంది. నువ్వు కులుకులు పోయే చురుకైన అమ్మాయివి. ఈ రోజు నీ తిట్లు కూడా తియ్యగా అనిపిస్తాయి' అని సమాధానం ఇస్తున్నాడు. పాటలో పదాలను వింటూంటే, చెవులు సంతోషంతో నృత్యం చేస్తాయి. నోరు తీయన అయిపోతుంది. పాటలో చమత్కారం మన్సును రంజింప చేస్తుంది. తెరపై కనబడే దృశ్యం మన్మోహనంగా ఉంటుంది. హృదయం ఆనందమైపోతుంది.

తక్ తక్ న మార్ ఫిచ్ కారీ కే ధార్

కోమల్ బదన్ సహ సకే నా యే మార్

తూ హై అనాడీ బడా హీ గవార్

కజ్‌రే మే తూనే అబీర్ దియా డార్

తెరీ సే ఝుక్ ఝోరీ సె బాజ్ ఆయీ హోరీ సే

చోర్ తెరీ చోరీ నిరాలీ రే...

పదాల వాడకంలో లయతోపాటు ఒక దృశ్యాన్ని కళ్లముందు నిలపటం ఉంది. అతడు పిచ్‌కారీతో ఆమెపై ఆత్రంగా రంగుల జల్లు కురిపిస్తున్నాడు. అందుకు స్పందనగా ఆమె 'తక్‌తక్ న మార్ ఫిఛ్ కారీ కీ థార్, కోమల్ బదన్ సహ సకే నా యే మార్' అంటోంది. ఆత్రంగా వెంట వెంటనే రంగుల ధారలను నాపై వదలకు, నా కోమలమైన శరీరం ఈ తాకిడికి తట్టుకోలేదు' అంటోంది. అంటే అతడు దొరికిందే అవకాశమన్నట్టు ఆత్రంగా ఆమెపైకి రంగులు విసురుతున్నాడన్నమాట. ఆమె అన్న విధానం చూస్తే 'మరింత రంగులు చల్ల మంటున్నట్టున్నది తప్ప, నా శరీరం ఈ

రంగుల తాకిడిని తట్టుకోలేదని బ్రతిమిలాడుతున్నట్టు లేదు. పైగా వెంటనే, నువ్వు అమాయకుడివి, పల్లెటూరి వాడివి కంటి కాటుక పై మధ్య ఎరుపు రంగు (అబీర్ అన్న అద్భుతమైన పదం వాడేడు భరత్ వ్యాస్) 'అబీర్' అంటే సూర్యాస్తమయ సమయంలోని ఎరుపు, ఆ ఎరుపు రంగు కలిపే చూపు' అంటోంది. అంటే, అతడు ఆమె కళ్ళల్లోకి రంగు చల్లాడన్నమాట. మోటు సరసం. అందుకే గవార్, ఊరోడా అని వెక్కిరిస్తోంది.

కళ్లకు కాటుక కళ్లకు రక్షణ నిస్తుంది. సూర్యాస్తమయంలోని ఎరుపు కాషాయ రంగులో ఉంటుంది నల్లటి కాటుక. కాషాయ వర్ణంలో కలవటం వల్ల కాషాయ పవిత్రతను కాపాడుతుంది. అంటే వారిద్దరి నడుమ సంబంధం కలిపాడన్నమాట రంగులు ఆమెపై వెదజల్లి. అతడు విసిరిన రంగులు కాటుకతో కలిశాయంటే, రంగులు కళ్లల్లో కొట్టాడన్నమాట.

గమనిస్తే పాటలో సున్నితమైన శృంగారం ఉంది. రెచ్చగొట్టటం ఉంది. మళ్లీ దూరం పెడుతున్నట్టు ఉంది. దగ్గరకు లాగుతున్నట్టు ఉంది. 'ఒక యువతి తాను భరించలేను' అనటం పురుషుడి ఉత్సాహాన్ని రేకెత్తించటంలాంటిది. ఆ 'భరించలేను' అన్నది, అనే విధానంలో పురుషుడు అర్థం చేసుకోవటం ఉంటుంది. పాట సందర్భంలో 'తిరిగి తిడతాను, నేను అమాయకురాల్ని కాను, ఏమనుకుంటున్నావో' అని పల్లవిలో అన్నామె, చరణంలోకి వచ్చేసరికి 'ఇంత వేగంగా రంగులు చల్లితే, నా సుకుమార శరీరం భరించలేదు అంటూనే నువ్వు అమాయకుడివి, ఊరోడివి రంగులు చల్లటం రాలేదు, నలుపులో ఎరుపు కలిపావు' అనటం రెచ్చగొట్టటం తప్ప మరేమీ కాదు .ఓ పక్క భరించలేనంటూ, మరో పక్క 'నువ్వు ఊరోడివి నీకు ఏం తెలియదు' అంటోంది. సున్నితమైన చమత్కార భరిత శృంగార గీతం.

మరో కోణంలోంచి చూస్తే నలుపులో ఎరుపు కలపటం వల్ల రంగు మారిపోతుంది. నల్లటి కాటుక పెట్టుకుని అందంగా తయారైన ఆమెపై ఎరుపు రంగు పులిమి ఆమె అందాన్ని పాడు చేశాడు. పైగా ఆత్రంగా రంగులు వెదజల్లుతున్నాడు ఆమె తట్టుకోలేనంత వేగంగా. అందుకే మోటువాడు, అమ్మాయి మనసు అర్థం చేసుకోలేని అమాయకుడు అని అంటున్నది. ఇది మరో రకమైన రెచ్చగొట్టటం. 'నీది మోటు సరసం, నువ్వు అమాయకుడివి' అంటే కూడా రెచ్చిపోతాడు యువకుడు. ఏ వైపు నుంచి చూసినా పాతకాలంలో గ్రామాలలో యువతీయువకుల నడుమ సాగే పరిధులు దాటని సున్నితమైన శృంగారపుటాటలను ప్రతిబింబిస్తుంది ఈ పాట.

అంతేకాదు తెరీ సే – అంటే నీతో, ఝుక్ ఝోరీ సే – అంటే నీతో వాదులాటలు, నువ్వు అటు లాగటం, నేను ఇటు లాగటంలో, బాజ్ ఆయీ – అంటే విసుగొచ్చింది. ఇక చాలు అన్నట్టు అర్థం. 'హోరీ సే', హోలీని 'హోరీ' అంటారు.

హోలీ రోజు పాడే పాటని కూడా 'హోరీ' అంటారు. అంటే, ఆ యువకుడు వెంటబడి ఏడిపిస్తూండటంతో, అతడితో ఇక వాదించి కొట్లాడి లాభం లేదని ఆమెకు హోలీ అంటే విసుగొచ్చింది. వెళ్లిపోతోంది అన్నమాట.

'వెళ్లిపోతాను'అన్న ఆమె వెళ్లటం లేదు, మళ్ళీ రెచ్చగొట్టింది. 'చోర్ తెరీ చోరీ నిరాలీరే'

'దొంగా, నీ దొంగతనం అద్వితీయమైనది' అంది. ఇంతకీ అతడు ఏం దొంగతనం చేశాడు? అదీ చమత్కార శృంగారానికి పరాకాష్ట.

'ఔనంటే కాదనిలే, కాదంటే ఔననిలే' అన్నట్టు ఆమె వాడిని తిట్టినట్టే తిడుతోంది. రెచ్చగొడుతోంది. 'నీతో పడలేను. పోతానంటోంది', 'నువ్వు నా హృదయం దోచావంటోంది.'

ధర్తీ హై లాల్, ఆజ్ అంబర్ హై లాల్

ఉడ్ నే దో గోరీ గాలోంకా గులాల్

మత్ లాజ్ కా ఆజ్ ఘూంఘట్ నికాల్

దే దిల్‌కీ ధడ్కన్ పే ధినక్ ధినక్ తాల్

ఆమె సున్నితమైన శృంగార చమత్కార భరిత దూషణలాంటి ప్రేమ సంభాషణకు అతడు దీటైన సమాధానం ఇచ్చాడు.

ఆకాశం ఎరుపు రంగులో ఉంది. భూమి ఎరుపు రంగులో ఉంది. నీ బుగ్గలలో కనిపించే గులాల్ రంగు (సిగ్గు)ను ఎగిరిపోనీ. అంటే అతడి చేష్టలకు ఆమె సిగ్గుపడుతూండటం వల్ల ఆమె బుగ్గలు ఎరుపెక్కాయి. 'గులాల్' రంగు మరో పేరు 'అబీర్' రంగు .ఆకాశం, ఎరుపు, భూమి ఎరుపు, ఆమె బుగ్గలూ ఎరుపే. కానీ తేడా చూపించటం కోసం 'గులాల్' అన్న పదం వాడేడు.

'గులాల్' అన్నది ప్రాకృతిక రంగుల మిశ్రమం వల్ల తయారయిన ఎరుపు. ఆకాశం ఎరుపు ప్రాకృతికం. భూమి ఎరుపు ప్రాకృతికం. అతడు రంగులు చల్లి, ఏడ్పించటం వల్ల కలిగిన ఆమె బుగ్గల ఎరుపు ప్రాకృతికం. ఆ ఎరుపు ఆమె సిగ్గుకు చిహ్నం.   ఆ ఎరుపును ఆకాశానికి ఎగరనీ అంటున్నాడు. అంటే సిగ్గుపడటం మానేయమని.

ఈ రోజు హోలీ. హోలీ పండగరోజు అన్న సంకోచాలు వదలి, తన హృదయ లయను అనుసరించి 'ధినక్ ధినక్' అన్న తాళం ప్రకారం నాట్యం చేయమంటున్నాడు. అందుకే ముందు 'మత్ లాజ్ కా ఆజ్ ఘూంఘట్ నికాల్' అన్నాడు. 'ఈ రోజు సిగ్గు అనే తెర ముసుగు వేసుకోకు అంటున్నాడు. తనతో స్వేచ్ఛగా కలసి నృత్యం చేయమంటున్నాడు.

ఖాంఝ్ బజే, చంగ్ బజే

సంగ్ మృదంగ్ బజే

అంగ్ మె ఉమంగే ఖుషియాలీరే...

అసలు ఆ పదాలు వింటూంటేనే చెవుల్లో అమృతం పోసినట్టుంటుంది. పాడుకుంటుంటే మనసు సంతోషంతో నృత్యం చేస్తుంది . ఝూంఝ్, చంగ్, సంగ్ మే మృదంగ్, అంగ్ ఊమంగ్.. ఝూంఝ్ అంటే cymbals, చాంగ్ అనేది వీణలాంటి తీగ వాయిద్యం. అవి మ్రోగుతూంటే వాటితో పాటు మృదంగం కూడా మ్రోగిందట. ఈ సంగీత వాయిద్యాల మ్రోతవల్ల శరీరంలోని ప్రతి అంగంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయట.

గమనిస్తే పాటలో ప్రస్తావించినవన్నీ భారతీయ వాయిద్యాలే, పాటలో వాడుతున్న రాగం సాంప్రదాయకమైనరాగంతో జానపద సంగీతం కలయిక. పదాలు శుద్ధ హిందీ గ్రామీణ పదాలు. అలాగని సాంప్రదాయ సాహిత్యంలో వాడే పదాలను వదలలేదు. నృత్యం శాస్త్రీయం, గ్రామీణం. అన్నీ కలగలిసి ఒక అత్యద్భుతమైన 'హోలీ'పాట రూపొందింది.

అయితే, పాటలో పదాలు పూర్తవుతాయి కానీ సినిమాలో పాట పూర్తికాదు. అసలు పాట ఇప్పుడే మొదలవుతుంది. సంధ్య నృత్య నైపుణ్య విశ్వరూప ప్రదర్శన ఇప్పుడే ఆరంభమవుతుంది. భారతీయ సంగీతం మనసునే కాదు శరీరాన్ని కూడా ఉర్రూతలూపేయగలదని సి. రామచంద్ర ఇప్పటి నుంచి నిరూపించటం ఆరంభిస్తాడు. శాంతారాం దర్శకత్వం , ఎడిటింగ్ ప్రతిభలు ఇప్పుడు విశ్వరూప ప్రదర్శన చేస్తాయి.

ఇంతవరకూ మగగొంతుకు మగ వేషం, ఆడగొంతుకు ఆడవేషం వేసి వేర్వేరుగా నృత్యం చేసిన సంధ్య ఇప్పుడు ముందు ఆడ, వెనుక వైపు మగ వేషం వేసుకుని ఒకేసారి అటూ, ఇటూ నృత్యం ఆరంభిస్తుంది. ఇది మామూలు నృత్యం కాదు. ఎంతో శక్తి కావాలి. ఓ వైపు అమ్మాయి చేస్తున్న నృత్యం, వెంటనే వెనక్కి తిరిగి మగవాడి నృత్యం .. ఇలా ఒకే వ్యక్తి ఇద్దరు వేర్వేరు వ్యక్తుల నృత్యాలు చేయాల్సి ఉంటుంది. పైగా ఎలాంటి తేడాలు రాకూడదు. పాట వేగానికి అనుగుణంగా

చేయాలి. పైగా, అది పెరిగే వేగం తప్ప తరిగే వేగం కాదు. అంత వేగంగా చేస్తూన్న నృత్యం షాట్ ఒక్కోటి తక్కువకు తక్కువ 30 సెకన్లుంటుంది. అలా నృత్యం చేయటం ఎంతో కష్టం.

ఓ వైపు సంధ్య నృత్యం మనసును మురిపిస్తూ ఒక అద్భుతమైన సంగీత నృత్యాల లోకానికి తీసుకుపోతూంటే, పెద్ద వినాయకుడి విగ్రహంలోంచి ఏనుగు వెలికి వస్తుంది. సంధ్య అడుగుతో అడుగు కలుపుతుంది. సంధ్య ఏనుగుతో పోటీపడి నృత్యం చేస్తున్నదా, ఏనుగు సంధ్యను పరీక్షిస్తున్నదా? అనిపిస్తుంది. అద్భుతమైన దృశ్యం. అంటే, భగవంతుడు కూడా సంగీతలయకు ముగ్ధుడయి నృత్యం చేస్తున్నాడన్నమాట.

భారతీయ సంగీతం అది శాస్త్రీయమైనా, జానపదమైనా, లల్లాయి పదాలైనా, భగవంతుడికే అంకితం. భగవంతుడిని చేరేందుకు సంగీత యోగం ఒక మార్గం. అందుకు నిదర్శనం ఈ పాట. అంతవరకూ పాట లయకు ఊగిన శరీరం ఇప్పుడు భక్తితో ఊగుతుంది. ఆ తరువాత సంధ్య ఒక్కర్తే అద్భుతమైన, అతి వేగవంతమైన, అతి కఠినమైన నృత్యం చేస్తుంది.

ఆ దృశ్యంలో రాజభవనం దృశ్యంలోకి 'డిజాల్వ్' అవుతుంది. అక్కడ కూడా అందరూ లయకు ఊగిపోతూంటారు.

పాట పూర్తయ్యేసరికి ప్రేక్షకుడు ఏదో ఆనందమయ లోకంలోకి వెళ్లిపోతాడు.

అత్యద్భుతమైన రీతిలో కళాకారులందరూ కూడబలుక్కుని అత్యుత్తమ కళాప్రదర్శన చేశారు. అందుకే ఈనాటికీ ఈ పాటను మించిన 'హోలీ' పాట మరొకటి లేదు. శృంగారం, చమత్కారం, భక్తి, అద్భుతమైన నృత్యం, సంగీతం, అన్నీ కలగలసి తనువునూ, మనసునూ కదిలిస్తాయి. బ్రహ్మానందానుభూతినిస్తాయి.

ఈ సినిమాకన్నా ముందు శాంతారాం 'దో ఆంఖే బారా కలహాథ్' సినిమాను నిర్మించాడు. సినిమా నిర్మాణ సమయంలో అతడి కంటికి గాయం అయింది. దాదాపుగా కన్నుపోయిన పరిస్థితి నెలకొంది. దాంతో అతడికి కన్ను విలువ అర్థమయింది. రంగుల ప్రపంచంలోని సౌందర్యం బోధపడుతుంది. అందుకే 'నవరంగ్' సినిమాను రంగులతో నింపేశాడు, ముఖ్యంగా, ఈ పాటలోనయితే రంగుల రసప్రవాహ కలిత బహుసుందరమైన నృత్య ప్రదర్శన దర్శనం చేయించాడు. కళాకారుడి అంతరంగ లోతులను ప్రదర్శించాడు. అందుకే ఆనాటికీ, ఈనాటికీ 'నవరంగ్' అత్యద్భుతమైన సినిమా. 'జారే ఆరే నట్ ఖట్' అత్యద్భుతమైన 'హోలీ పాట.' (వచ్చే నెల మరిన్ని పాటలతో)

Click here to share your comments on this story